# పంటిపోటు

**★ అయ్యగారి విశ్వేశ్వరరావు ★**

పాపం-భానుమూర్తిగారికి పంటిపోటుట్రా.

కొంచెంచూసి రాకూడదా. ఇరుగూ-పొరుగుకాదా - అంది మా అమ్మ. మా అమ్మది చాలా జాలిగుండె. ఎవరైనా బాధ పడుతూంటే చూళ్లేదు. చేతనయినంత సహాయం తానూ చేస్తుంది. ఎదటివాళ్లని కూడా చేయమంటుంది. అలా చేసేదాకా చెవిని ఇల్లుకట్టుకొని పోరుతుంది. అంచేతనే కొంతిమ్మగారంటే ఘరాణామనిషి అంటారంతా.

మా అమ్మమాట నాకు వేదవాక్యం. ఆవిడ చెప్పిందికదా - అని భానుమూర్తి గారిని చూడటానికి వెళ్లాను. భానుమూర్తి గారు చిన్నవాడూ కాదు చితకవాడూ కాదు. మనమల్ని ఎత్తిన ఓబాపతు ముసలి వాడే అవాలి కాని ఈయనకి చిన్నరోగం వచ్చినా - యింటిల్లపాతిని చంపేస్తాడు. ఇంతెందుకు - కొంచెం తలనొప్పి వచ్చిందంటే - ఎంతో ఇంబేలుపడతాడు. ఇంకే వుంది నవనాడులూ లాక్కుపోతున్నాయంటాడు. ఊరగాయకుండలు సద్దుకోండర్రా! అంటూ అప్పగింతలు ఆరంభిస్తాడు. తనగోడవే తనదికాని - 'ఫరవాలేదయ్యా - తలనొప్పికే ఛస్తారా' అని అన్నామా - 'నీకేం తెలుసునోయి - చావు మూడిందంటే తలనొప్పిచాలదా - ఏరోగం లేకుండా ఎందరు చావటంలేదు-' అంటూ చావులూ - ఆ చావుల కారణాలు ఏకరువు పెడతాడు. ఈయనతో వేగలేక - అలాగే పరిపెట్టుకుంటారు పాపం - యింట్లోవాళ్లు.

నన్ను చూసి - భానుమూర్తిగారు బ్రహ్మానంద పడ్డట్టు సూచనగా - అంతవఱకూ పమానరాగంతో పట్టుతూన్న మూలుగు మాని - దుప్పటీ ముసుగు తీసి చూసి - ఆ మూలుగు అక్షరాలతోనే - మధ్యమధ్య ఆపుతూ - బాధని యీ సమయంలోనే ప్రకటిస్తూ - 'వచ్చా-వా - నాయనా' అన్నాడు.

అవునండి - మాఅమ్మ చెప్పింది - మీరు చాలా బాధపడుతున్నారని. చూసిపోదాం అని వచ్చాను - అన్నాను.

'ఏమీ లేదునాయనా—యీ పన్ను చూశావూ' అంటూ నోరు తెరిచి ఓదంతాన్ని వేలెట్టి చూపించాడు. 'ఆఁ' అన్నాను. 'ఇదేనయ్యా ప్రాణాలు తీసేస్తోంది. ఒక్కటే సలుపు. సలుపన్న సలుపా—దీని తస్సాదియ్యా—ప్రాణాలు తోడేస్తోంది. ఏమీ తిననీయదు. నమలనీయదు. ఒకటేపోటు—ఏమీ తోచదు. యమబాధ. దీనికి సాధనం యేమిటో తెలియటం లేదబ్బాయీ—' అన్నాడాయన.

'దీనికింత బ్రహ్మాండం ఏవిటండీ—పంటివైద్యుడు మన ప్రక్కయింటిలోనే వున్నాడుగదా. పీకిపారేయించకూడదా. ఎందుకీ వృథాబాధ; అన్నాను నేను.

'సరే — మన ప్రక్కయింటి డాక్టరు సంగతి చెబుతున్నావ్ — బావుంది—' అంటూ చాలా అసంతృప్తిని ప్రకటించే అభినయ పూర్వకంగా పాడి అక్షరాల్ని చప్పరిస్తూ వదిలాడు. ఆ వరస అంతా చూస్తే—ఆయనభావం నాకేమీ బోధపడలేదు. ఇంతకీ ఆయన్ని 'అలా అనడంలో మీ వుద్దేశం ఏవి' టన్నాను.

'ఆఁ ఏమిలేదు. అందరికీ తెలిసిన సంగతే గదా. మన పంటివైద్యుడు గారికి అంత లేక—లేకమన్నా అందం వుందంటావా-ఆనందం వుందంటావా. పై పెచ్చు నోరు తెరిస్తే—ఆ ఖాళీస్థలంలో వట్టి బోసితనం కదా. అంచేతనే—డాక్టర్ని అడిగాను. పెద్దవాణ్ణి. పుణ్యమూ—పురుషార్థం—పెటుబడిలేనిపని. వూరికే పీకి పారేయండి. మరి కొన్నాళ్లకి—ఇంకేమైనా పళ్లు వూడితే టటుంటే మీ చేత వూడదీయించుకుంటాను. అన్ని పళ్లూ వూడదీశాక—ఆఖర్ని మంచి పళ్ళు మీ చేతే కట్టించుకుంటాను. కీర్తి కాంచన లేకుండా చంద్రుడికో నూలు పోవన్నట్లు మీకు నేనిచ్చుకొనేది-ఇస్తాను-అంతా సాటివాళ్లం—మనం—మనవొకటి—మీ నాన్నగారెంతటివారు. వసంతకుసుమాకరాన్ని ఇంట్లో వండించి ఎంతోమంది అతిమూత్ర వ్యాధుల్ని—దయాసముద్రులై—ఉచితంగా నివారణ చేసిన మహనీయులని—ఇంకా ఏవేవో చెప్పినా—ఆ పెంకి మనిషి కొంచమైనా ప్రాక్టీసు లేదని. ఏనాబోటి అభాగ్యుడికో యిలాంటి విపత్తు రావడం, ఆయన సంపత్తు అనుకుంటాడు. భరింపరాని ఫీజుతో బిల్లు పంపుతాడు. మనం తూగగలమా నాయనా—' అంటూ ఆయన, ఆదాయ వ్యయ విమర్శన ప్రారంభిస్తూ—ప్రసుత ధరవరల పెరుగుదలని ఉదాహరిస్తూ 'వట్టి పంటిపోటుకే యింతింత బిల్లులు చెల్లించాలంటే—పిల్లలున్నవాళ్ళం పెద్ద కుటుంబీకులం—మనకి సాధ్యమా? చెప్పనాయనా!, అని అందుకున్నాడు.

'ఇంతకీ ఆయన ఏమన్నాడేవిటి—పోనీ నేనువెళ్లి తీసుకురానా—' అన్నాను.

వెంటనే అందుకున్నాడు భానుమూర్తి గారు. 'పన్ను తీసేయమన్నాను. అంతే వెండి పన్ను కాదు-బంగారుపన్ను కాదు-ఏదీఇమ్మనలేదు. ఈ యమబాధపెట్టేపన్నునుపట్టకారుతో పీకిపారేయడంఏమంతఘనకార్యం చెప్పు' పన్ను పీకడానికి తనకేం ఖర్చు చెప్పు! అవునా! యీ మాత్రం పన్ను పీకడానికి-మన పొరుగింటి డాక్టరుకి—అయిదు రూపాయలు అధమం ఫీజుట. ఏం చెప్పను నా మొహం. అందంగా వుండే పన్ను పీకి పారేవిన్నాడా. పరీక్షలు పాసయి—బోర్డులు కట్టుకొని—బస్తీలలో డిస్పెన్సరీలు పెట్టుకొని చేవార్సు వైద్యంచేస్తే—వేరే బిచ్చం ఎత్తుకోక్కర్లేదంటూ—తన వెలితిని ముఖాన పెట్టాడనుకో అబ్బాయీ అన్నాడు రుసరుసలాడుతూ భానుమూర్తిగారు.

'పోనీ—అయిదు రూపాయ లేకదండీ—ఈ యమబాధ పడేకన్న—చేతివి అయిదు రూపాయలు పోనిచ్చి—పన్ను తీయించి పారేసి హాయిగా వుండదా? అయిదు రూపాయలకి కక్కుర్తిపడి—లోభించి—బాధపడడం నా కిష్టం లేదన్నాను.

'పడుచు కాపరం—చిలుకల మంటూ!' అన్నారు. అయిదు రూపాయలంటే అంత తేలికటయ్యా. ఎంత కష్టపడితే అయిదు రూపాయలురాను. చెమటవోడ్చి సంపాదించిన సొమ్ముని అంత తేలికగా ఖర్చు చేయడం ఏం వివేకం చెప్పు. రావడం కష్టం—వచ్చిన సొమ్మును యిలా వెచ్చిస్తే ఈ రోజుల్లో బ్రతకగలమా చెప్పు, పన్ను పీకడానికి - ఇంత ఫీజేమిటి, అబ్బాయీ - బాధైనా పడతాను కాని - ఆ పెంకిడాక్టరు కోరిన ఫీజు యిస్తాననుకొన్నావా? ఛస్తే-

# ★ పంటిపోటు ★

యివ్వను. యివ్వనంటే యివ్వను' అన్నాడు.

'పోనీ ధర్మాసుపత్రికి వెళ్ళకూడదా - అక్కడ వూరికే వైద్యం చేస్తారు. మందు లిస్తారు. పళ్ళుపీకుతారు. ఏ రోగానైనా నయంచేస్తారు. నామాటవిని ధర్మాసుపత్రికి పొండి,' అన్నాను - తెలిసిందిగా - భానుమూర్తిగారు మహాలోభి.

'మానాయనే, కొంచం యడ్రసు చెప్పు. ఆ ధర్మాసుపత్రికితోవ చెప్పు' అంటూ హఠాత్తుగా ఆనందం తెచ్చుకొని ధర్మాసుపత్రి వివరాలు విన్నాడాయన. 'తప్పకుండా వెళ్ళండి. బాధపడకండి,' అని చెబుతూ నేను ఇంటికివచ్చాను. మా అమ్మకి జరిగినదంతా చెప్పాను. 'భానుమూర్తిగారు చాలాలోభి. లోభికి ఖర్చుక్కువ. ఏబ్రాసికి పనెక్కువ అంటారు కాదటమ్మా' అన్నాను మా అమ్మతో.

ఆవిడకి భానుమూర్తి గారంటే పెద్దవాడని గౌరవం. పూర్వపు వాళ్ళకీ - ఇప్పటి వాళ్ళకీ ఆహార విహారాలలో - ఆరోగ్యంలో ఆదాయవ్యయాలలో ఎంతభేదం వుందో మా అమ్మ గంభీరోపన్యాసం యిచ్చింది - ఎకనమిక్సు చదివిన ఉపన్యాసకురాలులాగ, ఆవిడమీదవుండే గౌరవంకొద్దీ-మాఅమ్మతో వాదించక ఆఫీసుకు పోయాను. సాయంకాలం యింటికివచ్చాను. మాఅమ్మ భానుమూర్తిగారి ఇంటికి పోయిందన్నారు. ఎలావున్నాడో ముసలాడు అనుకుంటూండగానే మా అమ్మ ఇంటికివచ్చింది. ఎలావుందమ్మా? భానుమూర్తిగారికి? ధర్మాసుపత్రికి పోలేదా- ఆయన?' అన్నాను.

'వెళ్ళాడురా పాపం ఒక్కడూను. అక్కడ ఏదో చీటీ తీసుకోవాలట. ఆ చీటీ తీసుకోవడానికి బ్రహ్మాండంగా జనం వున్నారట. కొల్లేటి చేంతాడులాగవున్న ఆ వరసలో నిలబడి నిలబడి-భానుమూర్తిగారి కాళ్ళు పీక్కుపోయాయట. సరేనని-నానా అవస్థపడి-ఎలాగో చివరికి చీటీ సంపాయించుకొని-పంటివైద్యంచేసే చోటుకి మేడ మెట్లెక్కిపోయాడట. అక్కడ ఇంకా చాలామంది వున్నారట. అది పెద్ద వరసలో నుంచోవాలట. పాపం అలా నుంచుంటోండగానే ఒంటిగంట అయిందట. ఆ డాక్టరు కొంతమందిని తనిఖీచేసేసి-మిగిలినవాళ్ళంతా రేపురండి! అన్నాడట. ఈయనా-ఈయన తోటి పంటిరోగులు చక్కావచ్చారట. పాపం మళ్ళీ రేపు వెళ్ళాలంటున్నాడు-' అంది మా అమ్మ.

'అరే! అలాగయిందా! తప్పకుండా రేపు వెళ్ళమనవమ్మా-కానీ ఖర్చులేకుండా పన్ను పీకేస్తారు—' అన్నాను.

'ధర్మాసుపత్రికి వెళ్ళిరావడానికి ఒక రూపాయి ఖర్చయిందట ఆయనకి. మళ్ళీ రేపు పోవాలికదా. ఇంకో రూపాయి ఖర్చు. అప్పుడే రెండు రూపాయలు ఖర్చవుతోందే- అన్నాడాయన. పెందరాళేపోతే యివాళే పన్ను పోయేది! రేపు పెందరాళే పోవాలి! అంటున్నాడు భానుమూర్తిగారంది-అమ్మ!

"అలా చూసుకున్నా అయిదు రూపాయల ఖర్చు తప్పిందికదా—రెండు రూపాయలతో పన్నుపోతే మూడు రూపాయలు భానుమూర్తిగారికి లాభమేనమ్మా' అన్నాను నేను.

'ఆయనా అలాగే అనుకుంటున్నాడు. పంటిబాధ ప్రమాదంకాదనీ— ఇలాంటిబాధపడుతూన్న వాళ్ళని ధర్మాసుపత్రిలో చాలామందిని చూశాననీ—తనకేం ఫరవాలేదనీ— ఇవాళకి కొంచెం ఓపికపడితే—రేపు పూర్తిగా పంటిని పీకేయించుకోవచ్చుననీ— ఇదంతా నీవు చూపించిన సదుపాయం—అనీ —ధీమాగా వున్నాడురా భానుమూర్తిగారు—" అంది అమ్మ.

'పోనీలేవమ్మా—వెయ్యేళ్ళకీ ఆయన కులాసాగావుంటే అంతేచాలు! పెద్దవాడు పాపం' అన్నాను.

మర్నాడు ఆఫీసునుంచి వచ్చింకే తడవుగా-మా అమ్మ ఆతురతతో పోయి - భానుమూర్తి మావగార్ని చూశారా! నాయనా!" అంది. "ఏమమ్మా - కులాసాలేదా - అంత కంగారుచేస్తా వెందుకమ్మా" అన్నాను.

"ముందు-వెళ్ళి చూసిరారా" అంది అమ్మ. ఏంకొంపమునిగిందోనని-గుండెల్ని గుప్పెట్లో పెట్టుకొని బయలుదేరాను. నేనేగా ధర్మాసుపత్రికి పొమ్మన్నది. ఏమయిందో అక్కడ. ఏలావున్నాడో యిక్కడ! ఏమిటో అయోమయంగా కనబడింది. చరా-చరా-భానుమూర్తిగారి ఇంటికిపోయాను. వీడిల్లు బంగారంగాను తెగ అల్లరిచేస్తున్నాడు. కుర్రాడిలాగ, ఒక్కటే కాకిగోల. పన్నుపీకించుకొని-ఇంత గాబరాచేస్తా డెందుకో నాకర్థం కాలేదు.

"ఏమిటి మావగారూ - ఏమిటిదంతా-" అన్నాను.

"వచ్చావా - నాయనా - రా! బాబూ! కూర్చో!" అంటూ బాధతో ఒగరుస్తున్నాడు - ఆ ఒగర్పుతోనే చెబుతున్నాడు.

"నిన్న ఏంజరిగిందో విన్నావుకదా"— అన్నాడు.

'ఆఁ మా అమ్మ చెప్పింది'-అన్నాను.

"చెప్పిందికదా, ఇవాళ పెందరాళే వెళ్ళాను అస్పత్రికి. మళ్ళీ యింకోరూపాయి ఖర్చు. మొత్తం రెండు. నిన్నా - యివాళా కలిపి రెండురూపాయ లయ్యాయి. రూపాయలమాట అటుంచు, అక్కడ యీ పంటిబాధగల ఆసాముల నందర్ని ఒక కోటుమనిషి వచ్చి తనిఖీచేశాడు. తనిఖీచేసి ఒక గదిలోకి పొమ్మన్నాడు. వరసాగ్గా - అందరం ఆ గదిలో కూర్చున్నాం. మరో కోటుమనిషి వచ్చి నోరు తెరవండి - అలాగే తెరుచుకొని వుండండి అన్నాడు. అక్కడ వున్నవాళ్ళమందరం నోళ్ళు అలాగే తెరుచుకొని వున్నాం. ఒక సీసాడు మందుతో ఆ కోటుమనిషి ఒక్కొక్కడి పంటి వరసకే మందు పులుముతున్నాడు నాదగ్గరికే వచ్చాడు. బాగా రుద్దేసిపోయాడు అబ్బాయీ. నమ్ముతావో నమ్మవో కాని-ఆ మందు ఆ పళ్ళవరసకి రుద్దేశా! అంతా అయోమయంగా వుందనుకో— అన్నాడు భానుమూర్తిగారు.

'ఏం - వికారంపెట్టి - పైత్యంచిందా?' అన్నాను.

"పైత్యమూ కాదు శైత్యమూ కాదయ్యా నాయనా. ఆ మందుపూత వున్నంత మేరా. మొద్దుతిమ్మిర అనుకో. బాధపెట్టే పంటి గొడవ గప్‌చిప్. వ్యాధులు డాక్టర్లకి హడిలి పోతాయికాంసు - మంత్రగాడికి దెయ్యాలు లొంగినట్లు!" అంటా డాయన.

'బాగానే వుంది - ఇంతవరకూ. తరవాత ఏమయిం' దన్నాను.

(56- వ పేజీ చూడండి)



అనేక సంవత్సరముల అనుభవముతో నవీన పద్ధతులలో మాచే తయారుచేయబడిన యినుపపెట్టెలు, ఉక్కు బీరువాలు, క్యాష్ బాక్సులు, మరియు ఆఫీసు రాకులు సరసమైన ధరలకు సకాలములో తయారుచేసి యివ్వగలము.

ఆంధ్రదేశపు ఈ పరిశ్రమను ప్రోత్సహించండి.

ఆంధ్ర సేఫ్ కంపెని,

షోరూము: సరస్వతీ టాకీస్ రోడ్, విజయవాడ-1.

వర్కుషాపు: మునిసిపల్ ఆసుపత్రీరోడ్, విజయవాడ-1.

# పంటిపోటు

(12-వ పేజీ తరువాయి)

'అదిగావా! విను! మరికొంతసేపటికి పట్టకారు పట్టుకొని యింకో కళ్ళద్దాల సూటుబూటు పెద్దమనిషి వచ్చాడు. వాని పక్కనే చిన్నగిన్నెతోటి దూదితోటి ఓ పెద్ద గౌను తొడుక్కున్న ఆడది. ఒకటే కంగారు-పళ్ళ కంగారు చల్లగా వుండా-ఇల్లా 'అయిందా— "చూపించు!-ఏ పన్ను బాధ పెడుతోందో చూపించు!- చప్పున చూపించు!" అంటూ ఆయన - ఆ సూటు బూటు పెద్దమనిషి - అందర్నీ అడుగుతూ - పళ్లు పీకిపారేస్తూ-ఏదో దూదిముందు ఇస్తూ-సరిగ్గా నాదగ్గరకి వచ్చాడు. బాధపెట్టేపన్ను చూపించమన్నాడు. నాకు అన్నీ పళ్లూ ఒకలాగే వున్నాయి. బాధపెట్టే పన్నుని ఆనవాలు పెట్టుకున్నా నా-పాడా! ఆ పెద్దమనిషికి ఒకటే తొందర. మాటా తోచదు మంతీ తోచదు. పోటు ఎక్కడ ఆరంభమయిందో కొంచెం ఆనవాలు వుందిగా - అక్కడ వేలు పెట్టి చూపెట్టాను. చూపెట్టిందే తడవుగా పట్టకారుతో పట్టి లాగి-పన్నును బయటపడేశాడు - పిల్ల యముడులాగ—' అన్నాడు భానుమూర్తిగారు.

'మొత్తానికి పన్ను తీయించేశారన్న మాట. పాపం - కొంతసలుపు వుంటుంది లెండి యివాళిటికి. రేపటికి పూర్తిగా సుళువిస్తుంది. పాడుపన్ను ఎంత పీడించిందండీ—'అని నేనంటూండగానే-ఆయన యిలా అందుకున్నాడు.

'అదికాదయ్యా మహానుభావా!' అన్నాడు చిరాకుగా.

'మరేది-ఏంజరిగిందో చెప్పండి మరి' అన్నాను.

'నేను చూపించినపన్ను. బాధపెట్టే పన్ను కాదు. మంచి ఫస్టాసైనపన్ను. అలిమ్మిరిలో బాధపెట్టేపన్ను దాక్కుంది. మంచిపన్నువైపు వా చేయి పోయింది. ఈ గొడవలో ధర్మాసుపత్రి డాక్టరుగారు పీకినపన్ను బాధలేనిది. ఈబాధ పెట్టేపన్ను యింకా - ఇలాగేవుంది చూడు-' అంటూ భానుమూర్తిగారు మళ్ళీ బాధపడటం ప్రారంభించాడు.

నిష్కారణంగా మంచిపన్ను పోయింది. పోటుపెట్టేపన్ను అలాగేవుంది. పాపం భానుమూర్తిగారి బాధని ధర్మాసుపత్రి తీర్చలేకపోయింది-' అనుకున్నాను.

'పోనీ-రేపువెళ్లి జరిగిన సంగతంతా చెప్పి ఆపోటు పెట్టేపన్నును పీకించకూడదా' అన్నాను.

'భయంవేసోందోయి బాబూ - ఆ వరస వారీగా మంచోవడం - వాళ్ళధాటికి తట్టుకోవడం మాటలా; ఇంత ఓపికపట్టి రెండు రోజులు రెండురూపాయలు ఖర్చుపెట్టుకొని మంచిపన్ను తీయించుకున్నాను. విన్నావా!' అన్నాడు భానుమూర్తిగారు దీనంగా. నాకూ జాలివేసింది ఆయన్ని చూస్తే.

అంతట్లోనే మా అమ్మ వచ్చింది ప్రక్కయింటి పళ్ళడాక్టరుతో. భానుమూర్తిగారు ఏవనుకొన్నాడోమరి - డాక్టరుగారికి నమస్కరించాడు. కొంప తివ్వి - ధర్మాసుపత్రిఫార్సు - యీయనకి చెప్పిందా మా అమ్మ అనుకున్నాను, నాకుమాత్రం చెప్పాలనిలేదు.

తెలుసునో మరి తెలియదో ఆ డాక్టరు ప్రశ్నించకుండానే ఆ బాధపెట్టే పంటిని తీసేసి - మందుకూడా యిచ్చి - రావలసిన అయిదు రూపాయల ఫీజు పుచ్చుకొని— ఫరవాలేదు భానుమూర్తిగారూ అంటూ ధైర్యంచెప్పి చరచరా వెళ్లిపోయాడు డాక్టరు. ఆ పన్ను తీశాక - నిద్రకు మొహం వాచిన భానుమూర్తిగారికి సుఖనిద్ర పట్టింది.

"రా రా యింటికిపోదాం" అంది అమ్మ. ఇంటికి వచ్చాం. 'ఎంత లోభంవుంటే అంత ఖర్చు అవుతుందమ్మా,' అన్నారమ్మా అన్నాను అమ్మతో.

'మంచిపన్ను తీయించడానికి రెండు రూపాయలు ఖర్చుచేసినప్పుడు - బాధపెట్టే పన్ను తీయించడానికి అయిదు రూపాయలు ఖర్చుచేయడం దుబారా కాదురా' అంది అమ్మ.

మర్నాడు భానుమూర్తిగారు— 'కొంత మక్కయ్యా' అంటూ వచ్చాడు. 'కులాసాగా వున్నారా - బాధ తగ్గిందికదా-' అంది అమ్మ. 'తగ్గకేంచేస్తుంది. ఎన్నాళ్లు బాధపడాలో అన్నాళ్లూ బాధపడక తప్పదు ఎలాంటి వాళ్లకైనా—' అన్నాడు భానుమూర్తిగారు.

'బాధపెట్టే పన్ను అయిదు రూపాయలకు పోయినా - నొప్పిలేని పన్ను నిష్కారణంగా రెండు రూపాయలు మింగిందే— గ్రహచారం' అని నేనంటూంటే— భానుమూర్తిగారు అన్నాడు - 'కిలం వదిలితేనే కాని ఫలం దక్క'దని, మర్నాడు నేను ఆఫీసుకు పోతూంటే - పంటిడాక్టరు ప్రత్యక్షమయ్యాడు. ఒకరికొకరు నమస్కారాలు చెప్పుకున్నాం. 'మీ భానుమూర్తిగారు కులాసాగా వున్నాడుకదా!' అన్నాడాయన. 'మీదయవల్ల కులాసాగానే వున్నాను సార్—' అన్నాను నేను. 'చూశావా -- ఉడుం పట్టుపట్టి -- అయిదు రూపాయిల్ని ఆయన బిగపట్టినా - మనకి దక్కే యోగం వున్నప్పుడు ఆయన అడ్డు పెట్టగలడా చెప్పండి' అన్నాడాయన, అందుకనే సార్ - నేనన్న.

"ప్రాప్తమున్నచో ఫలమేల తప్పురా!
విశ్వదాభిరామ వినురవేమ"— అన్నాడన్నాను.

'బాగాచెప్పారే!' అనే అభినందన ఆయన చేస్తూండగానే- నవ్వుకుంటూ ఆయన అటూ - నేనిటూ విడివడ్డాం. ★




(9-వ పేజీ తరువాయి)

ఆదేశాలకే భిన్నమైన సిఫార్సులు చేయడానికి ఉద్యమించింది, అందువల్ల సంఘాన్ని నియమిస్తూ ఏమాత్రం ఆలోచించకుండా నిర్వచించిన నియమనిబంధనలే ఈ రగడ కంతకూ కారణం. దీనివిషయమై రాజధానిలో ఇప్పుడిప్పుడే జ్ఞానోదయమవుతున్నది. కేంద్ర న్యాయశాఖమంత్రి ఈ సంఘ నియామక నిబంధనలలో వున్న అసందర్భాన్ని పురస్కరించుకొని ఒక తాఖీదు తయారు చేసినట్లు తెలుస్తున్నది. నిబంధనల మార్పుకు పారమెంటులో త్వరలోనే ఒక ప్రతిపాదన రావచ్చు. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad